శివయ్య ఆదాయం కోటీ 42 లక్షలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లకు, పరివార దేవతలకు ముక్కంటి భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం కోటీ 42 లక్షలా 89 వేలా 870 రూపాయలు వచ్చింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. బంగారం 0.072 గ్రాములు, వెండి 487.800 కిలోలు, 124 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు వచ్చినట్లు ఈవో నాగేశ్వరరావు తెలిపారు.

ముగిసిన తిరుపతి గంగ జాతర

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర బుధవారం ఉదయం అమ్మవారి చెంప నరకడంతో ముగిసింది. ఏడు రోజులుగా భక్తులు వివిధ రకాల వేషాలతో అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కడప, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఇవాళ ఉదయం పేరంటాల వేషం వేసుకున్న కైకాల వంశస్థులు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తుల సమక్షంలో అమ్మవారి చెంప నరికి జాతర ప్రక్రియను ముగించారు. తిరుపతి ఆధ్యాత్మిక సౌందర్యాన్ని పొందింది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ప్రసిద్ధ జాతరలలో తిరుపతి గంగమ్మ జాతర చాలా విశిష్టమైనది. ప్రతి సంవత్సరం మే నెలలో ఏడు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. సంప్రదాయం ప్రకారం తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఈనెల 14న అర్ధరాత్రి కైకాల వంశస్థులు గ్రామంలో చాటింపు పూజలు నిర్వహించి నగర శివారులో చాటింపుతో జాతరను ప్రారంభించారు. జాతర ప్రారంభం కాగానే అమ్మవారి కపకుపాత్రులు కావాలని పూజలు నిర్వహించారు. జాతర 1వ రోజు బైరాగి వేషం, 16న బండ వేషం, 17న తోటి వేషం, 18న దొరవేషం, 19న మాతంగి వేషం, 20న సుననపు కుండలు, 21న గంగమ్మకు చప్పరంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జంతు బలిపై నిషేధం ఉన్నప్పటికీ ఆలయంలో ఓ మూలన ఇష్టానుసారంగా మేకలు, కోడిగుడ్లు నరికివేసేవారు. అలాగే గంగమ్మ దేవి జాతరలో మరో విశేషం కూడా ఉంది, జాతర జరిగినన్ని రోజులు గ్రామస్థులు ఊరు విడిచి వెళ్లరు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు రాత్రి బస చేయకుండా వెళ్లిపోవడం ఇక్కడ ఆనవాయితీ. గంగమ్మ జాతరకు 900 సంవత్సరాల చరిత్ర ఉంది, గ్రామదేవతగా అవతరించిన గంగమ్మ తిరుమల శ్రీవారికి చెల్లెలు అని నమ్ముతారు.

తిరుపతి జాతరలో పుష్ప గెటప్..

తిరుపతిలో గంగమ్మ జాతర ఘనంగా ముగిసింది. రోజుకో వేషంలో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎర్రచందనం బ్యాక్ డ్రాప్ స్టోరీతో అల్లుఅర్జున్ పుష్ప సినిమా వచ్చింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న పుష్ప-2లో బన్నీ తిరుపతి జాతర సందర్భంగా ఓ వేషం వేశారు. తాజా జాతరలో పలువురు భక్తులు బన్నీలాగే తయారై అమ్మవారిని దర్శించుకున్నారు.

గంగజాతర ప్రశాంతం : ఆరణి శ్రీనివాసులు హర్షం

తాతయ్యగుంట గంగమ్మ జాతర ప్రశాంతంగా ముగియడం పట్ల ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. వేలాది మంది భక్తులు గంగమ్మకు ఇష్టమైన వేషాల్లో వారం రోజులపాటు కొలిచి మంగళవారం మొక్కులు చెల్లించుకోవడం సంతోషంగా ఉందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ప్రజలందరిపై గంగమ్మ ఆశీశ్శులు మెండుగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. జాతర ప్రశాంతంగా ముగియడంలో గంగమ్మ గుడి ఆలయ అధికారులు, సిబ్బందికి, పోలీసులు, మున్సిపల్ కార్పోరేషన్ సిబ్బందికి ఆయన కతజ్ఞతలు తెలిపారు.

సమాజ మార్పుకు అధ్యయనమే నాంది..

సిపిఎం రాష్ట్ర నేత మిరియం వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సమాజ మార్పుకు అధ్యయనమే నాంది అని సిపిఎం రాష్ట్ర నేత మిరియం వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సిపిఎం నాయకులకు, కార్యకర్తలకు ఎనిమిది రోజులు పాటు యశోదనగర్‌లోని ఎంబి భవన్‌లో నిర్వహిస్తున్న అధ్యయన క్యాంపుకు సిపిఎం జిల్లా నేత కేఎన్‌ఎం ప్రసాద్ రావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. సిపిఎం రాష్ట్ర నేత మిరియం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద ప్రమాదాన్ని ఎదుర్కోవాలంటే పార్టీ శ్రేణులకు అధ్యయనం అవసరమని, సమాజ మార్పుకు నిత్యం పోరాడుతున్న సిపిఎం శ్రేణులు అధ్యయనాన్ని నిరంతరం చేపట్టాలన్నారు. మారుతున్న పరిస్థితులకు కనుగుణంగా పనిలో మార్పు రావాలని, అందుకు సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో వస్తున్న ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేసేవి తప్ప, ప్రజలకు మేలు చేసేవి కావని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలపై అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, అన్నమయ్య జిల్లా నాయకులు చంద్రశేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

బదిలీపై తిరుపతి జిల్లాకు వచ్చిన పలువురు పోలీసు అధికారులు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు వద్ద రిపోర్ట్ చేసి, బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అందులో తిరుపతి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్పిగా వెంకటాద్రి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్‌గా విశ్వనాథ్ చౌదరి, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వారి అభినందించారు. అలాగే అలిపిరి సిఐగా రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లా ఎస్పీ, వెస్ట్ డిఎస్పి, అలిపిరి సిఐ తదితరులు బదిలీ చేసిన విషయం విధితమే. అలిపిరి సిఐగా రామారావును నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు.

అలిపిరి సిఐ రామారావు

హింసాత్మక ఘటనలపై 'వెరీ సీరియస్'

పోలీసులూ బాధ్యతాయుతంగా వ్యవహరించండి : ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. జూన్ 4న కౌంటింగ్ ప్రారంభమవుతుంది. అదే రోజున ఎన్నికల ఫలితాలు కూడా వెలువడుతాయి. ఈనేపథ్యంలో ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో బుధవారం ఎస్పీ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూన్ 4న ఫలితాలు వెల్లడయ్యే క్రమంలో హింసాత్మక ఘటనలు, అల్లర్లు చెలరేగే అవకాశం ఉందని తమకు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ఉందని తెలిపారు. ఫలితాలు వెల్లడైన రోజు నుంచి మరో 10 రోజుల వరకు ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడినా, అల్లర్లను ప్రేరేపించినా చాలాతీవ్రంగా పరిగణించి అదనపు సెక్షన్లు బనాయించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే క్రమంలో పోలీసులు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే వారిపైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తిరుపతి జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇప్పటివరకు 22 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశామనీ, ఇంకొంతమందిపై కూడా రౌడీషీట్లో ఓపెన్ చేస్తామని వివరించారు. కౌంటింగ్ జరిగే పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంగణం చుట్టూ మూడంచల భద్రత ఉంటుందనీ, ఎన్నికల సంఘం సిఫారసు చేసిన వ్యక్తులు తప్పా ఇంకెవరు లోనికి వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసు సిబ్బంది కూడా కౌటింగ్ కేంద్రం చుట్టూ పహారా ఉంటుందని వెల్లడించారు. పోలింగ్, కౌంటింగ్, ఫలితాలు వెల్లడి సందర్భాల్లో కార్యకర్తల నడుమ భావోద్వేగాలు ఉండడం సహజమేననీ, అవి హింసాత్మక ఘటనలకు ప్రేరేపించకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ నాడు శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందనీ, కౌంటింగ్ ముగిసిన మరో పది రోజులు కూడా పోలీసులు పహారా కాస్తారని తెలియజేశారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి డిఎస్పి ఉమామహేశ్వరరావు, వన్ టౌన్ సీఐ నరసింహారావు, టూ టౌన్ సీఐ రారాజు, తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర పాల్గొన్నారు.

శ్రీకాహస్తి డిఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

అధికారులు బాధ్యతగా పనిచేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి- క్యాంపస్: సార్వత్రిక ఎన్నికలు -2024 ప్రక్రియలో భాగంగా జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్‌లో ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్‌ఓలు, కౌంటింగ్ సూపర్వైజర్లకు, సహాయకులకు, మైక్రో అబ్జర్వర్స్‌లకు జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ విధానంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 4వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలు- 2024 ఓట్ల లెక్కింపు విధానంలో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు కీలక పాత్ర వహించి కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఒక పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించిన ఏడు నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు కేటాయించబడిన సంబంధిత అధికారులు అందరు ఈవీఎం, వీవీ ప్యాట్‌లు, ఓట్ల లెక్కింపుల గురించి హ్యాండ్ బుక్‌ని క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుని కౌంటింగ్ నిర్వహణలో ప్రముఖపాత్ర వహించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో కౌంటింగ్ సూపర్వైజర్‌లు వారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో టేబుల్స్ ఏర్పాట్లను, భద్రతను పటిష్టంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించిన సిబ్బంది యొక్క మొబైల్ ఫోన్లు కౌంటింగ్ సెంటర్లోకి అనుమతి లేదని తెలిపారు. కౌంటింగ్ విధులు కేటాయించబడిన సిబ్బంది ఉదయం 7గంటలకు అందరూ కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఎలాంటి అలసత్వం వహించరాదని అన్నారు. ఓటర్ల లెక్కింపు ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని ఆర్వోలు అందరూ కౌంటింగ్ ముందుగానే నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను సరిచూసుకోవాలని తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై కూడా సంబంధిత అధికారులు జాగ్రత్త వహించి కౌంటింగ్ నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ సమయంలో వీడియో కవరేజ్ చేపట్టడం, కౌంటింగ్ రోజు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలన ఉంటుందన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే ప్రతి ఒక్క సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల పార్టీ ఏజెంట్లు కూడా కచ్చితంగా గుర్తింపు కార్డులు ధరించాలని తెలిపారు. కౌంటింగ్ విధులు కేటాయించిన సిబ్బందికి తాగునీరు, భోజన సౌకర్యం కల్పించాలని తెలిపారు. కౌంటింగ్ అనంతరం ఈవీఎం, వీ వీ ప్యాట్‌లు, పటిష్టమైన బందోబస్తు ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లోకి చేర్చేలా ఆయా నియోజకవర్గాల ఆర్వోలు సిద్ధంగా ఉండాలన్నారు. జెసి ధ్యాన చంద్ర, మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు, రిటర్నింగ్ అధికారులు నిశాంత్ రెడ్డి రవిశంకర్ రెడ్డి, చంద్రముని, కిరణ్ కుమార్ రెడ్డి, నియోజకవర్గాల ఆర్వోలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్

ఏపి ఆర్ సెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏపిఆర్ సెట్ 2023-24ను మే నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన విషయం విధితమే. ఈ సెట్ ఫలితాలను బుధవారం 3 గంటలకు ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఏపి ఆర్ సెట్ - 2023-24 మొత్తం 64 సబ్జెక్టులలో నిర్వహించడం జరిగిందని, మ్తొత్తం 10050 మంది దరఖాస్తు చేసుకోగా 8651 మంది హాజరయ్యారని వారిలో 4352 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో పురుషులు 2226 , స్త్రీలు 2126 వున్నారని తెలిపారు. ఎస్వీయూకు రీసెట్ 2023-24 నిర్వహణ బాధ్యతలు అప్పగించిన ఉన్నత విద్యామండలి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విజయవంతంగా సెట్ నిర్వహణ చేసిన కన్వీనర్ ఆచార్య దేవప్రసాద్ రాజును అభినందించారు. ఏపి ఆర్ సెట్ - 2023-24 కన్వీనర్ ఆచార్య దేవప్రసాద రాజు మాట్లాడుతూ వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా వున్న 2728 పిహెచ్‌డి సీట్లకుగాను ఏపిఆర్ సెట్-2023-24 నిర్వహించామని, ఎంట్రన్స్ లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు జూన్ 10 తర్వాత ఇంటర్వ్యూలు నిర్వహించి ర్యాంకులు ప్రకటిస్తామని తెలిపారు. ఫలితాలను https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్లో చూడవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆచార్య కిశోర్, ఆచార్య కుమారస్వామి, ఆచార్య కుసుమ హరినాథ్, కామేష్, నాగభూషణం, సుకుమార్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కౌంటింగ్ సజావుగా జరిగేందుకు రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా మరియు సంబంధిత అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు 7 నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి కౌంటింగ్ సజావుగా జరిగేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని కావున ఉదయం 7 గంటల వరకు కౌంటింగ్ సూపర్వైజర్లు అసిస్టెంట్లు మైక్రోఅబ్జర్వర్లు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సంబంధిత కౌంటింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు. ముందుగా ఈటీబిపీఎస్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, కంట్రోల్ యూనిట్ పోల్ అయిన ఓట్లు లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు కౌంటింగ్‌కు సంబంధించిన ఏజెంట్ల ఏర్పాటు కొరకు కౌంటింగ్‌కు మూడు రోజుల ముందు నుంచే దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత రిటర్నింగ్ అధికారులు తమ నియోజకవర్గ పరిధిలోని అభ్యర్థులతో సమావేశం రేపు గురువారం నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ అనేది సంబంధిత రిటర్నింగ్ అధికారి బాధ్యత అని, తప్పక దానిని ఎంతో పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రశాంత కౌంటింగ్ లక్ష్యంగా, పక్కాగా పనితీరు ఉండాలని, కౌంటింగ్ డేటా క్రోడీకరణ, ఎన్కోర్ యాప్ నందు అప్లోడ్ సక్రమంగా సకాలంలో చేయాలని, ఇంటర్నెట్ బ్యాండ్ విడ్త్ సరిచూసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో మోడల్ కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామని, ఆన్ హ్యాండ్ ఎక్స్పీరియన్స్ వస్తుందని తెలిపారు. కౌంటింగ్ హాల్‌లో కంప్యూటర్లు, ఇంటర్నెట్, కుర్చీలు, టేబుల్, సిబ్బంది ఏర్పాటుకు సంబంధిత ఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మీడియా సెంటర్ ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని, సమాచార సమన్వయం కొరకు ప్రతి నియోజక వర్గం నుండి ఒక అధికారిని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారితో సమన్వయం చేసుకుని మీడియా కేంద్రంకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ టేబుల్‌లు గూడూరు 3, వెంకటగిరి 3, సూళ్లూరుపేట 3, చంద్రగిరి 6, తిరుపతి 6, శ్రీకాళహస్తి 4, సత్యవేడు 3 ఏర్పాటు ఉండాలని సూచించారు. వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ధ్యానచంద్ర, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్, డిఆర్‌ఓ పెంచల కిషోర్, రిటర్నింగ్ అధికారులు కిరణ్ కుమార్, నరసింహులు, చంద్రముని, రవిశంకర్ రెడ్డి, నిషాంత్ రెడ్డి, నోడల్ అధికారులు రామ్మోహన్, చంద్రశేఖర్ రెడ్డి, కోదండ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఈవిఎం స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్

క్యాంపస్ :పోల్డ్ ఈవిఎంలు భద్రపరచిన శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం రాత్రి సదరు స్ట్రాంగ్ రూమును కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం భద్రత ఏర్పాట్లు 24/7 అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీటీవీ కెమెరాల కంట్రోల్ రూములో ఈవిఎంలను పరిశీలించారు. సందర్శకుల రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు ఎస్పీ రిజర్వ్ శ్రీనివాస రావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఉన్నారు.

ఏపీ సీఎంతో సత్సంబంధాలు కొనసాగిస్తా..

సీఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుమల: తెలంగాణ సీఎంగా ఏపీ సీఎంతో సత్సంబంధాలు కొనసాగిస్తానని రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ ఏపీ సీఎంతో కలిసి సమస్యలు పరిష్కరించుకుని కలసికట్టుగా నడుస్తామన్నారు. రెండు రాష్ట్రాల అభివద్ధికి ఒకరికి ఒకరు సహకరించుకోవాలని ఆకాంక్షించారు. తిరుమలలో తెలంగాణ ప్రభుత్వం తరపున సత్రం, కళ్యాణ మండపం నిర్మిస్తామని ప్రకటించారు. శ్రీవారి సేవలో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యం కూడా తీసుకోవాలని ఏపీ సీఎంకు విజ్ఞప్తి చేస్తామన్నారు. రాజకీయాలపై విలేకర్లు ప్రశ్నించగా తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదని చెప్పారు. రైతాంగాన్ని ఆదుకుని దేశ సంపదను పెంచాలని తమ ఆలోచన అని తెలియజేశారు.

తూపల్లె జనార్థన్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి- క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భూగోళశాస్త్ర పరిశోధక విద్యార్థి టి. జనార్థన్‌కు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల విభాగపు నియంత్రణాధికారి ఎం. దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా మునిసిపల్ పట్టణాల మురికివాడలపై అధ్యయనం-సామాజిక, ఆర్థిక సర్వే ఆంధ్రప్రదేశ్.. అనే అంశంపై డాక్టర్ వై.సుజాత పర్యవేక్షణలో జనార్థన్ తన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఇది వరలో ఆయన తిరుపతి కార్పొరేషన్‌లో మురికివాడలపై ప్రపంచీకరణ ప్రభావం మరియు మురికివాడల ప్రజలకు ఆర్థిక వెసులుబాటు లేకపోవడానికి గల కారణాలపై అధ్యయనం అనే అంశాలపై, రెండు జర్నల్స్‌లో వ్యాసాలు ప్రచురించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్వి యూనివర్సిటీ సైన్స్ కమ్యూనికేషన్‌పై నిర్వహించిన సెమినార్ లో పాల్గొన్నారు. ఇటీవల బెంగళూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యూజిట్ సమ్మేళనంలో, డైనమిక్స్ ఇన్ అర్బన్ స్లమ్స్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌పై అధ్యయనం అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. 25 సంవత్సరాల పైగా జర్నలిస్టుగా అనుభవం కలిగిన టి.జనార్థన్ డాక్టరేట్ డిగ్రీ పొందడం పట్ల ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు అభినందనలు తెలియజేశారు.

పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న భానుప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వడమాలపేట మండలం బొమ్మరాజపురం పంచాయతీకి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ బాబు ముగ్గురు కుమార్తెలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. బుధవారం ఆ కుటుంబ సభ్యులను టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్, నాయకులు ధనుంజయులు నాయుడు, మురళి రెడ్డి, ఎస్బిఆర్ పురం మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ ఆ గ్రామానికి చేరుకొని పరామర్శించారు. ఆ కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.

వేసవి శిక్షణా శిబిరం

సమ్మర్ క్యాంపులో విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కేవిబి పురం మండలంలోని బ్రాహ్మణపల్లి కొత్తూరు కర్లపూడి గ్రామాల్లో ప్రజాప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కోఆర్డినేటర్లు వేణుగోపాల్, చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవికాలంలో ఎండల్లో తిరగడం వలన చిన్నారులకు వడ దెబ్బ తగిలి అవకాశం ఉందన్నారు. చిన్నారులను దృష్టిలో ఉంచుకొని ట్రస్ట్ ద్వారా ప్రతి పంచాయతీలోనూ వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు చల్లటి వాతావరణంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. తద్వారా చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉంటారన్న ఉద్దేశంతో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఈశ్వరయ్య, గంగయ్య, చెంచురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ విద్యార్థుల తల్లిదండ్రులకు బాల్య వివాహాలు, బాల కార్మికులు డ్రాప్స్ ఔట్స్ నిరోధించేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య అధికారి డీఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం బీఎన్ కండ్రిగ డాక్టర్ దివాకర్ నేతృత్వంలో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలను వివరించారు.

మహిళలకు చీరలు పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న రమేష్ దంపతులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రమేష్ బేకరీ అధినేత రమేష్, జయలక్ష్మిల 28వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రగతి ఆఫీస్‌లో కేక్ కట్ చేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 50 మంది పేద మహిళలకు చీరలు, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరు శ్రీనివసులు, యామిని, లక్ష్మిదేవి, గోపి, సుబ్బా రెడ్డి, రవి, రామ్మోహన్ రావు, రాము, కుమార్ నాయుడు, వెంకటేశ్వర్లు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న చారిటీస్ సభ్యులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులకు ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ.. తమ క్లబ్ సభ్యురాలు అయిన సౌందర్య అమ్మ తనయుడు పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను ప్రయోజకులను చేస్తే కొంతమంది స్వార్థపరులు డబ్బులు చెల్లించి వృద్ధాశ్రమంలో తల్లి దండ్రులను విడిచి వెళ్లడం మంచి పద్ధతి కాదని సూచించారు.

సీఎస్‌ను మార్చితేనే ప్రశాంతంగా కౌంటింగ్: కిరణ్ రాయల్

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కిరణ్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డిని ఎన్నికల సంఘం మార్చితేనే రాష్ట్రంలో ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్ జరుగుతుందని, ఇందుకోసం జనసేన పార్టీ తరపున ఎన్నికల సంఘానికి లేఖ రాశామని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పోలింగ్ అనంతరం హింసాత్మక ఘటనలు జరగడానికి కారణమైన వ్యక్తి సిఎస్ జవహర్ రెడ్డి అని, ఎన్నిసార్లు ఎన్నికల సంఘానికి లేఖల ద్వారా విన్నవించిన ఆయనను మాత్రం ఆ స్థానంలో ఉంచడం వల్ల అనుమానాలకు తావిస్తోందన్నారు. హింసాత్మక ఘటనలు మళ్లీ చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరగాలంటే ఆయనను తప్పించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. పద్మావతి మహిళా వర్సిటీ వద్ద జరిగిన పులివర్తి నానిపై హత్యాయత్నం ఘటనలో పాల్గొన్న పి.సుధాకర్ రెడ్డికి బదులు తిరుమల వాసి అయిన అమాయకుడైన ఏ.సుధాకర్ రెడ్డిని అరెస్టు చేసి హత్యయత్నం కేసులో ఇరికించడం దారుణం అన్నారు. సిట్ విచారణపై ఏమాత్రం విశ్వాసం కలుగ లేదన్నారు. ఎవరికీ తెలియకుండా సిఎస్ జవహర్ రెడ్డి విశాఖపట్నం ఎందుకు వెళ్లారన్నారు. ఎలక్షన్ కమిషన్ జవహర్ రెడ్డి విషయంలో ఎందుకు ఆయనను వెనకేసుకొస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఇకనైనా ఎన్నికల సంఘం సిఎస్ జవహర్ రెడ్డిని ఆ స్థానం నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మునస్వామి, సుమన్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ జూ పార్కులో ఘనంగా జీవవైవిధ్య దినోత్సవం

విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శన శాల(ఎస్వీ జూ పార్కు)లో ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు గుంటూరు వారి ఆధ్వర్యంలో విశ్వం హైస్కూల్ విద్యార్థులకు బర్డ్ వాక్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషాచల అడవులలో జీవవైవిధ్య సంపదను గురించి విద్యార్థులకు వివరించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను ఐఎఫ్ఎస్ అధికారిని యశోద భాయ్, జూక్యురేటర్ సి.సెల్వం అందించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జి.సతీష్, ఎర్రచందనం గోదాముల డిఎఫ్ఓ శివకుమార్, సామాజిక వనవిభాగం డిఎఫ్ఓ ధర్మరాజులు, అసిస్టెంట్ క్యూరేటర్ నాగభూషణం, రాష్ట్ర కోఆర్డినేటర్ ఖాదర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుధీర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం పట్టణ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నిఘంటువులు పంపిణీ చేశారు. బాలాజీ రెడ్డి, ప్రవీణ్, మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. తాటిపర్తి ఎంపీటీసీ భర్త శోభన్ నాయుడు బుధవారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాదులోని బొజ్జల నివాసంలో సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శోభన్ నాయుడు భరోసా ఇచ్చారు. శోభన్ నాయుడుతో పాటు నవీన్ నాయుడు, బాలాజీ నాయుడు ఉన్నారు.

తిరుపతిడెస్క్: ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో శ్రీకాళహస్తి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా టిడిపి నేతలు, అభిమానులు కేక్ కట్ చేశారు. ఘనంగా పుట్టిన రోజును జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్తప్ప మొదలై, ఉమా మురుగన్, సీతాపతి ఆచారి, కృష్ణయ్య, కృష్ణప్ప మొదలై, సూర్య ప్రకాష్, రవికుమార్, అర్జున్ బాబు, రోశయ్య, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం రేణిగుంట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మండల నాయకులు నిర్వహించుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ముని చంద్రారెడ్డి, మునస్వామి నాయుడు, చిన్నారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, కందన్ రెడ్డి, జగదీష్, సాగర్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అంతర్జాతీయ జీవవైవిధ్య మండలి దినోత్సవం సందర్భంగా పుత్తూరు ఆయుర్వేద అండ్ నేచర్ క్యూర్ నిర్వాహకులు, గ్రీన్ క్రాస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా.సింగరాజు చంద్రశేఖర్ రాజు వారి చే ఔషధ మొక్కలైన అశ్వగంధ, మునగ, పాలకూర విత్తనాలు ఉచితంగా బుధవారం పంపిణీ చేశారు. ఆహారమే ఔషధము కనుక పెరటిలో ప్రతి ఒక్కరూ ఔషధ మొక్కలను పెంచడంవలన ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకు మన వంతు భాధ్యత నిర్వహించిన వారము అవుతామని తెలిపారు.

పులివర్తి నానికి నేతల పరామర్శ

నానిని పరామర్శిస్తున్న భాను ప్రకాష్, కొలకపూడి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): తిరుపతి మహిళా యూనివర్సిటీలోని టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై ఈ నెల 14న వైసీపీ మూకలు హత్యయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే.. అయితే ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ క్రమంలో గాయపడిన పులివర్తి నాని చికిత్స అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్, తిరుపూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొలకపూడి శ్రీనివాసరావులు రఘునాథ్ రిసార్ట్స్‌లోని నానిని కలిసి పరామర్శించారు. ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఓటమి భయంతోనే పులివర్తి నానిపై దాడికి పాల్పడినట్లు వారు ఆరోపించారు. 30ఏళ్ల చంద్రగిరి చరిత్రను పులివర్తి నాని తిరగరాయబోతున్నారని స్పష్టం చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- చంద్రగిరి సీఐ రామయ్య

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత గొడవలు జరిగిన రామిరెడ్డిగారిపల్లి, కూచువారిపల్లి, ఏ.రంగంపేట గ్రామాలలో ప్రశాంత వాతావరణన్ని తీసుకురావడానికి ప్రజలు సహకరించాలని చంద్రగిరి సీఐ ఎం.రామయ్య కోరారు. బుధవారం శాంతిభద్రతలు పరిరక్షణ చేయాలనే ముఖ్య ఉద్దేశంతో చంద్రగిరి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ (కవాతు)ను ఆ గ్రామాల్లో నిర్వహించారు.. స్థానికులతో సమావేశమై చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శంకర్ ప్రసాద్, చంద్రగిరి ఎస్ఐ అనిత, పోలీస్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను ఆదరించండి: వెంకటేశ్వర్లు

వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చేనేత ఉత్పత్తులను ఆదరించాలని గేటు ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి నగర పరిధిలోని ఏఐఆర్ బైపాస్ రోడ్డులో జీవన్ జ్యోతి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతీయ హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శనను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ్మినేని వెంకటేశ్వర్లు, డెవలప్మెంట్ సొసైటీ సెక్రటరీ అతిన్ కుమార్ జైస్వాల్ మాట్లాడుతూ ఈ చేనేత వస్త్ర ప్రదర్శనలో దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు తయారు చేసిన 50పైగా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. తిరుపతి నగర ప్రజలు ఈ చేనేత వస్త్ర ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

బిజెపితో కలవకుంటే టిడిపికి మరిన్ని సీట్లు..

- ఈవీఎంలు మార్చే ప్రమాదం ఉంది..
- మాజీ ఎంపీ చింతామోహన్

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): భారతీయ జనతా పార్టీతో తెలుగుదేశం పార్టీ కలవకుండా ఉంటే మరిన్ని సీట్లు వచ్చే అవకాశం ఉండేదని, సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తరువాత జరిగిన ఘటనలతో ఈవీఎంలను మార్చే ప్రమాదం కూడా పొంచి ఉందని మాజీ ఎంపీ చింతామోహన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ఏ మొహం పెట్టుకొని ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడుగుతున్నాడని తనదైన శైలిలో చింతామోహన్ విమర్శనాస్త్రాలను ఎక్కుపెట్టారు. పత్రికా స్వేచ్ఛను పూర్తిగా హరించిన మోడీ మీడియాకు సంకెళ్లు వేశారని ఆరోపించారు. మోడీ పదేళ్ల కాల పాలనలో ఏ వర్గానికి చెందిన ప్రజలు అభివద్ధి చెందారో చెప్పాలన్నారు. ఎన్నికల కమిషన్‌పై విశ్వాసం సన్నగిల్లిందని, పోలీసు యూనిఫామ్ వేసుకున్న వ్యక్తి గూడూరు రిజర్వుడు నియోజకవర్గంలో డబ్బుల వాటాలు పంచడం ఏందని ప్రశ్నించారు. సాక్షాత్తు తిరుపతి ఎస్పీ కార్యాలయం వెనుక ఓటుకు నోట్లు పంచుతుంటే సమాచారం అందించిన స్పందించలేని పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ కు ఇరు పార్టీల వారు డబ్బులు పంపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్య పాలు చేశారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పతనం మొదలైందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లతోనే ఆయన భవితవ్యం తేలిపోయిందన్నారు. ఎన్నడూ లేని విధంగా నాలుగు వేల నుంచి రూ.5వేల కోట్ల రూపాయలు ఎన్నికల కోసం రాష్ట్రంలో ఖర్చు చేశారని, ఈ డబ్బంతా ఎక్కడి నుంచి తెచ్చారో అర్థం కావడం లేదన్నారు. 40ఏళ్లలో ఎన్నడూ చూడని విధంగా 2024 సార్వత్రిక ఎన్నికలు జరిగాయని, పార్టీ అభ్యర్థులు కేవలం డబ్బులు పంచి ఓట్లు అడిగారే కానీ వారి విధివిధానాలను ప్రజలకు వివరించలేదన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక దశల వారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 150 సీట్లు వస్తాయని, కేంద్రంలో ప్రజలందరూ మెచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి పట్టణ అధ్యక్షులు యార్లపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

పీరం కుమార్‌కి డాక్టరేట్ ప్రదానం

డాక్టరేట్ అందుకుంటున్న పీరకుమార్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఎస్.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న పీర కుమార్‌కి విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈయన వృద్ధి, అస్థిరత, సరఫరా ప్రతిస్పందనలు (ఆంధ్రప్రదేశ్లోని ప్రధాన పంటలపై అధ్యయనం) అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను అర్థశాస్త్రంలో డాక్టరేట్‌ను పొందారు. సీనియర్ ప్రొఫెసర్ ఎన్ఆర్పి రమణారెడ్డి మార్గ దర్శకత్వంలో పీర కుమార్ పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సిద్ధాంతాన్ని సమర్పించారు. సిద్ధాంత పరిశీలనకు వచ్చిన బహిర్గత పరిశీలకులు ఈ సిద్ధాంతం సంతృప్తికరంగా ఉందని ప్రశంసించారు. ఈయన గతంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించే వివిధ దూరదర్శన్ సప్తగిరి ఛానల్‌లో ప్రసారమైన టెలీ ఫిల్మ్‌లలో (కరువు సీమలో కాంతి రేఖలు, నవోదయం. మొదలైనవి) కథానాయకుడిగా కూడా నటించి ఉండడం విశేషం. యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించడంతో కళాశాల అధ్యాపకులు మిత్రులతో సహా నెల్లూరు టీవీ సినిమా నాటక రంగ కళాకారులు కూడా ఆయనను అభినందించారు. పీర కుమార్ మాట్లాడుతూ పరిశోధనపై ఆసక్తిని రేకెత్తించి మార్గదర్శనిర్దేశం చేసిన గైడ్ సీనియర్ ప్రొఫెసర్ ఎన్ఆర్పీ రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు టీసీల అందజేత

విద్యార్థులకు టీసీలు అందిస్తున్న హెచ్ఎం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పాసైన విద్యార్థులకు బుధవారం హెచ్ఎం రమణయ్య టీసీలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2023-24వ సంవత్సరానికి పాఠశాలలో 151 మంది విద్యార్థులు 10పరీక్షలు రాయిగా అందులో 133మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ప్రభుత్వ కాలేజీలు ఎన్నుకొని ఆ కాలేజీలో మంచి చదువులు చదివి మంచి భవిష్యత్తుతో ఎదగాలని ఆయన వారిని ఆశీర్వదించారు. గతంలో కంటే ఈ సంవత్సరం తమ పాఠశాలలో 10వ తరగతి మంచి ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: నారాయణవనంలో శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం చిన్నశేష వాహనంపై వేణు గోపాలస్వామి అవతారంలో కళ్యాణ వెంకటేశ్వరుడు రాత్రి 8 గంటలకు హంస వాహనంపై జ్ఞాన సరస్వతి అవతారంలో కళ్యాణ వెంకన్న గ్రామపుర వీధులలో భక్తులను కనువిందు చేశారు. చిన్న శేష వాహనంపై వేణుగోపాల స్వామి అవతారంలో గ్రామ పురవీధులలో మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, మధ్య ప్రజలను భక్తులను కనువిందు చేస్తూ దర్శనమిచ్చారు.

విద్యుదాఘాతానికి విదేశీ గూడ బాతు మృతి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: ప్రసిద్ధి పక్షుల కేంద్రాలలో నేలపట్టు పక్షుల కేంద్రం విదేశీ పక్షుల సంతాన ఉత్పత్తి కేంద్రంగా ప్రసిద్ధిగాంచింది. ఈ కేంద్రంలో విదేశీ పక్షి అయిన గూడ బాతు జాతిప్రాముఖ్యమైంది. ఏప్రిల్ మాసానికి దాదాపు ఈ కేంద్రం నుంచి ఆ పక్షి జాతులన్నీపయనమై విదేశాలకు వెళ్లిపోయాయి. అయితే కొన్ని పరిస్థితుల వల్ల అర, కొర గూడబాతులు మిగిలిపోయాయి. వీటిలో ఒకటి బుధవారం ఉదయం ఆహార వేటకు బయలుదేరి ఏకొల్లు పంచాయితీ వడ్డి పాలెం గ్రామ సమీపంలో 33/11కెవి విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. ఆ విదేశీ పక్షి అక్కడే విలవిల లాడి ప్రాణం విడిచింది. ఈ పక్షి ప్రమాద సంఘటనలో ట్రాన్స్ఫార్మర్, ఫీజు క్యారియర్స్, వంటి వాటిలో లోపాలు సంభవించి నాలుగు గంటల పాటువిద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాద సంఘటన సూళ్లూరుపేట మండలంలోని మన్నారు పోలూరు, గోకుల కృష్ణ ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద విద్యుత్ లైన్లలో సమస్యలు తలెత్తినట్లు కూడా ఏఈ సమాచారం ఉంది. నేలపట్టు వైల్డ్ లైఫ్ సిబ్బందికి కొందరు ఈ సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇలాంటి సంఘటనలో నేలపట్టు విదేశీ పక్షి చనిపోవడం చాలా అరుదైన సంఘటన.

రామాంజులరెడ్డికి నివాళి

రామాంజుల రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ పంచాయతీ ఉపసర్పంచి వసంతు అశోక్ కుమార్ రెడ్డి తండ్రి వసంతు రామాంజుల రెడ్డి ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. బుధవారం స్థానిక అశోక్ కుమార్ రెడ్డి నివాసం వద్ద శుభస్వీకరణ కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే, ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరై రామాంజుల రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS : TIRUPATI
ARC. No. 7 /2024

Between: M/s Dhanalakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt. Ltd., Tirupati Rep. by its Manager/Foreman ... Disputant

Vs.

A.Geetha & OTHERS ... Opponents

Opponent No.2 : S. Sri Ram Krishna S/o Late S. Kameswara Rao, D.No.18-2-10, Ashok Nagar, Near Devendra Theatre, Tirupati.

Opponent No.3 :M.Venkata ramana, S/o Late M.Nageswar Rao, D.No.19-12-476, Bairagipatteda, Near More Super Market, Tirupati.

Opponent No.6 K.Mahalakshmi W/o G.Sunil Kumar, Nandhna vanam, SVP Colony, Opp. Goshala, Tiruchanur, Tirupati.

Please take notice that above suit is posted to 01-06-2024 for your appearance before the above said Honourable Deputy Registrar of Chits, Opp. TUDA Office, Tirupati at 10:30 A.M either in person or through an advocate and raise your objections if any, failing which the case will be decided in your absence as exparte.

Hg Date : 01-06-2024

S.HARI PRASAD, B.A., LL.B,
Advocate, Tirupati.

In The Court of the 1st Additional Civil Judge (Junior Division) Tirupati
O.S.No.510/2022

Bank of Baroda T.P.Area Branch, Tirupati, rep. by its Chief Manager ...Plaintiff

V/s

P.Renuka ...Defendant

SUIT SUMMONS TO DEFENDANT

P.Renuka W/o P.Anil Kumar, D.No.19-3-3, Srinivasapuram, Renigunta Road, Tirupathi, Tirupati District.

The Plaintiff filed the above suit for recovery of amount Rs. 29,741.00 against you (the defendant)... The above case is posted to 20.06.2024 at 10.30 A.M. in the above court for your apperance and raise objections if any either in person or through your advocate otherwise the matter will be decided on the records available in the case.

Date of Hearing : 20.06.2024

G.MADHUSUDHANA REDDY
Advocate for Plaintiff, Tirupati.
Cell: 09440934263

In The Court of The Senior Civil Judge : Gudur
I.P.No. 15/2024

Govindarajula Sudhakar - Petitoner

Vs

1. Sarvepalli Vasista Phani
2. Kadiveti Sreenivasulu Reddy
3. Kadiveti Sreelatha - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరు పిటిషనరుకు 1వ రెస్పాండెంట్ అయిన సర్వేపల్లి వశిష్ఠ ఫణి గారు బాకీ ఉన్నందున పిటిషనరుకు బాకీ చెల్లించకుండా తనపేరుతో ఉన్న షెడ్యూలు ఆస్తిని 2, 3 ప్రతివాదులకు తేది: 22-01-2024న రిజిష్టరు కాబడిన రిజిష్టరు పత్రమును రద్దుపరచి అఫిషియల్ రిసీవర్‌కు స్వాధీనపరచి పై పిటిషనరుకు రావలసిన మొత్తము డబ్బులును ఇప్పించమని పై కోర్టులో పిటిషనరు **I.P. No. 15/2024** ను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు **తేది: 18-06-2024** ఆక్షేపణలు నిమిత్తం వాయిదా వేసియున్నారు. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసింది.

SCHEDULE

A-Schedule of 1st respondent

Thirupathi District - Thirupathi District - Gudur Sub Registration - Gudur Mandal - Gudur Municipality area - East Gudur Village - Sy.No.601, Ward No.12 - Muthyalapeta area - Door.No. 53- Assessment No.1029002751 - house site in an extent of 25 ankanams consisting of four floors of RCC Building **bounded by: East:** House site and building of Sarvepalli haripriya, **South:** G.Audilakshmi House some extent and Kamisetty Lakshmi Rajyam site and construction some extent. **West :** Municipality Road, **North:** Purini Venkatarathnam House site and house. with all easementary rights.

Market Value : 35,00,000/-

B-Schedule

Thirupathi District - Thirupathi District - Gudur Sub Registration - Gudur Mandal - Gudur Municipality area - East Gudur Village - Sy.No.601, Ward No.12 - Muthyalapeta area - Door.No. 53 - Assessment No.1029002751 and Door.No.61, Assessment No.1029002945 - house site in an extent of 33 ankanams or 264 Sq. yards consisting of four floored construction / Building with HSC.No.311301022232 **bounded by: East:** Municipality Road, **South:** G.Audilakshmi House some extent and Kamisetty Lakshmi Rajyam house some extent. **West :** Municipality Road, **North:** RCC house and sheet roofed house of purini Venkatarathnam and building of B.Saraswathi Bai house remaining extent. with all easementary rights.

Market Value : 50,00,000/-

రామిరెడ్డి రోజారెడ్డి
పిటిషనర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In The Court of The Senior Civil Judge : Gudur
I.P.No. 14/2024

Govindarajula Mamatha - Petitoner

Vs

1. Sarvepalli Vasista Phani
2. Kadiveti Sreenivasulu Reddy
3. Kadiveti Sreelatha - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరు పిటిషనరుకు 1వ రెస్పాండెంట్ అయిన సర్వేపల్లి వశిష్ఠ ఫణి గారు బాకీ ఉన్నందున పిటిషనరుకు బాకీ చెల్లించకుండా తనపేరుతో ఉన్న షెడ్యూలు ఆస్తిని 2, 3 ప్రతివాదులకు తేది: 22-01-2024న రిజిష్టరు కాబడిన రిజిష్టరు పత్రమును రద్దుపరచి అఫిషియల్ రిసీవర్‌కు స్వాధీనపరచి పై పిటిషనరుకు రావలసిన మొత్తము డబ్బులును ఇప్పించమని పై కోర్టులో పిటిషనరు **I.P. No. 14/2024** ను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు **తేది: 19-06-2024** ఆక్షేపణలు నిమిత్తం వాయిదా వేసియున్నారు. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసింది.

SCHEDULE

A-Schedule of 1st respondent

Thirupathi District - Thirupathi District - Gudur Sub Registration - Gudur Mandal - Gudur Municipality area - East Gudur Village - Sy.No.601, Ward No.12 - Muthyalapeta area - Door.No. 53- Assessment No.1029002751 - house site in an extent of 25 ankanams consisting of four floors of RCC Building **bounded by: East:** House site and building of Sarvepalli haripriya, **South:** G.Audilakshmi House some extent and Kamisetty Lakshmi Rajyam site and construction some extent. **West :** Municipality Road, **North:** Purini Venkatarathnam House site and house. with all easementary rights.

Market Value : 35,00,000/-

B-Schedule

Thirupathi District - Thirupathi District - Gudur Sub Registration - Gudur Mandal - Gudur Municipality area - East Gudur Village - Sy.No.601, Ward No.12 - Muthyalapeta area - Door.No. 53 - Assessment No.1029002751 and Door.No.61, Assessment No.1029002945 - house site in an extent of 33 ankanams or 264 Sq. yards consisting of four floored construction / Building with HSC.No.311301022232 **bounded by: East:** Municipality Road, **South:** G.Audilakshmi House some extent and Kamisetty Lakshmi Rajyam house some extent. **West :** Municipality Road, **North:** RCC house and sheet roofed house of purini Venkatarathnam and building of B.Saraswathi Bai house remaining extent. with all easementary rights.

Market Value : 50,00,000/-

రామిరెడ్డి రోజారెడ్డి
పిటిషనర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.